క్లుప్తంగా

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ భాస్కరరావు

తెర్లాం: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని ఏఎస్ఐ జి.భాస్కరరావు అన్నారు. ఎస్ఐ సాగర్ బాబు ఆదేశాల మేరకు తెర్లాం జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై శుక్ర వారం అవగాహన కల్పించారు.లైసెన్స్ లేకుండా ఆటో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలను మితిమీరిన వేగంతో నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బేబి నాయన, తదితరులు

తెర్లాం: మండలంలోని మోదుగువలస గ్రామంలో మూడురోజులుగా నిర్వహించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారంతో ముగిశా యి. ఉత్సవాలకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన హాజరై సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తు లు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సన్మానించారు. అలాగే తహసీల్దార్ హేమంత్‌కుమార్ సిబ్బందితో హాజరై రాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు జ్ఞాపిక అందజేసి, సత్కరించారు. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకట నాయుడు, మాజీ ఎంపీపీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


యోగా శిక్షణ తరగతులను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: యోగాంధ్రలో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామ స్థాయిలో నిర్వహించనున్న యోగా శిక్షణ తరగతులను అంతా కలిసి విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్ర వారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు ఎంపిక చేసిన టీఓటీలకు జిల్లా నుంచి వచ్చే టీఓటీలు రమేష్, రోషిణి శిక్షణ ఇస్తారని, టీఓటీలు అంతా హాజరయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.క్యూఆర్‌కోడ్ ద్వారా ప్రజలంతా స్వచ్ఛందంగా యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచుల పంపిణీ



గుడ్డసంచులను పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం సిటీ: పాలిథిన్ నిషేధంలో మేముసైతం అంటూ రాజాం–చీపురుపల్లి రోడ్డులోని కార్తికేయ డిపార్ట్‌మెంట్ స్టోర్స్ ముందుకొచ్చింది. స్టోర్స్ యజమాని జె.సింహాచలం పట్టణంలో శుక్రవారం 600 గుడ్డ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు.స్టోర్స్ యజమానిని రాజాం రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్ర శాంత్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు అభినందించారు. పెంకి చైతన్యకుమార్, రాంబాబు, నవీన్, సింధు, గణేష్, రాజు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే కుష్టు కావచ్చు




అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో ప్రజలకు లెప్రసీ వ్యాధిపై రేగిడి పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం వంటివి లెప్రసీ వ్యాధి లక్షణాలనిపీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు అన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే పీహెచ్‌సీల్లో లెప్రసీ నిర్ధారణ పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందిస్తున్నామని, జాగ్రత్తలు పాటిస్తూ మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణలకు నో అబ్జెక్షన్..!

- ఆక్రమిత స్థలాలకు అక్రమ అనుమతులు
- విచ్చలవిడిగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు జారీ
- వీటి ఆధారంగా విద్యుత్ కనెక్షన్లు
- పెరిగిపోతున్న అడ్డగోలు వ్యవహారాలు

రాజాం: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాజాంలో ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాల వుతున్నాయి. ఖాళీ ప్రభుత్వ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్నారు. చెరువుగట్లు, దేవదాయశాఖ భూములు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఖాళీ స్థలాలు ఇలా ఒక్కటేమిటి.. ఆక్రమణలకు కాదేది అనర్హం అన్న చందంగా రెచ్చిపోతున్నారు. తొలుత కర్రలు పాతడం, అనంతరం ఆయా ప్రాంతాల్లో బడ్డీ దుకాణాలు పెట్టడం.. చివరకు వాటి స్థానంలో యథేచ్ఛగా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుండగా.. ఆక్రమిత స్థలాల్లో వెలుస్తున్న దుకాణాల నిర్వహణకు అనుమతులు కూడా ఇచ్చేస్తున్నారు.



జీఎంఆర్ఐటీ రోడ్డులో చెరువు గట్టుపై వెలసిన బడ్డీ దుకాణాలు

మాన్యువల్ విధానంలో సర్టిఫికెట్లు జారీ..

ప్రభుత్వ స్థలాల్లో కొందరు చిరువ్యాపారాల పేరిట బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాలు, ఇతర నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలంటే వార్డు సచివాలయం నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే జిరాయితీ భూమి, రిజిస్ట్రేషన్ స్థలాలు, రెవెన్యూ పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్న వాటిలో చేపట్టే నిర్మాణాలు, ఏర్పాటు చేసుకునే దుకాణాలకు మాత్రమే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ సర్టిఫికెట్ కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ రాజాంలో ఆ నిబంధనలేవీ అమలు కావడం లేదు. ఆక్రమణదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకపోయినా సచివా లయాల వార్డు అడ్మిన్‌లు మాత్రం విచ్చలవిడిగా మాన్యువల్ విధానంలె సర్టిఫికెట్లు జారీ చేసేస్తున్నారు. అవకాశం లేకున్నవాటికి కూడా ఇష్టానుసారం సర్టిఫికె ట్లు ఇస్తుండడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా ఆక్రమణదారులు విద్యుత్ మీటర్లు పొందుతూ స్థలాలను కైవసం చేసుకుంటున్నారు. కొంతమంది ఇవే విద్యుత్ మీటర్ల బిల్లులు ఆధారంగా కోర్టుల్లో కేసులు వేసి ఆక్రమిత స్థలాలపై స్టేలు తెచ్చుకుని పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు.

పర్యవేక్షణ లోపం

రాజాంలో అటు మార్కెట్ యార్డు ప్రాంతం దగ్గర నుంచి ఇటు ప్రధాన రహదారిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలు, జీఎంఆర్ ఐటీ రోడ్డులో దేవదాయశాఖ భూములు, చెరువు గట్లపై స్థలాలను అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రధాన రహదారుల ఇరుకుగా మారడం, చెరువులు మాయమవ్వడం, దేవదాయశాఖ భూములు కనుమరుగవ్వడం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై దృష్టిసారించాలని, అడ్డగోలుగా ఇస్తున్న నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లను నిలిపివేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

విద్యుత్ మీటర్లతో పాటు ఇతర మౌలిక వసతులు నిమిత్తం పక్కా స్థలాలు, జిరాయితీలు ఉన్నవారు మాత్రమే అర్హులు. అలా కాకుండా ఎవరైనా సచివాలయ ఉద్యోగులు దేవదాయశాఖ భూములకు, ఆక్రమిత ప్రభుత్వ భూములకు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తే చర్యలు తప్పవు. రాజాం పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగించేందుకు ఇటీవల చర్యలు చేపట్టాం. ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణలనూ తొలగిస్తాం.

– జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం.

జగన్ పథకాల రద్దే లక్ష్యంగా చంద్రబాబు కుయుక్తులు

- ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాల రద్దు వెనుక కుట్ర అదే
- వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త శంబంగి ఫైర్



మాట్లాడుతున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను రద్దు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుయుక్తులు,కుట్రలు పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయ కర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేసిందని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేక ఎండీయూ వ్యవస్థను చంద్రబాబు రద్దు చేశారని మండిపడ్డారు. గిరిజన తండాలు, కాలనీలు,శివారు ప్రాంతాలకు రేషన్ వాహనం వెళ్లి ఆయా కుటుంబాలకు సరుకులు అంద జేసేదన్నారు. వాహనాల రద్దు వల్ల ప్రభుత్వానికి కలిగే ప్రయోజనం కానీ, వ్యయం మిగులు కానీ లేదన్నారు. అయినా పట్టుబట్టి ఇలా జగన్ పథకాలను రద్దుచేయడమే లక్ష్యం చేసుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇతర హామీలను అమలు చేయాలని చంద్రబాబును జనం ప్రశ్నిస్తుంటే...వాటిని అమలు చేయలేక జగన్ ప్రవేశపెట్టిన పథకాల రద్దుకు కుట్ర పన్నారన్నారు. చెరిపేస్తే చెరిగిపోయే అభిమానం జగన్‌ది కాదని, హామీ ఇస్తే అమలు చేసే తత్వం ఆయనదని అన్నారు. చంద్రబాబులా హామీలిచ్చి అధికారం చేపట్టాక చేతిలో ఏమీ లేవని, పథకాలు ఇవ్వలేకపోతున్నామని, ఏదైనా సలహా ఉంటే చెవిలో చెప్పా లంటూ మాట తప్పే నైజం జగన్‌ది కాదన్నారు. రేషన్ వాహనాలను రద్దు చేసి శివారు ప్రాంతాల వారికి రేషన్ సరుకులు ఎలా చేరవేస్తారని ప్రశ్నించారు. హామీలు అమలు చేసే నైజం చంద్రబాబుది కాదని శంబంగి ఎద్దేవా చేశారు.మరోసారి చంద్రబాబు చేతిలో మోసపోయామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, వెంటనే ప్రజలకిచ్చిన హామీలను శత శాతం అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ తెర్లాం మండల అధ్యక్షుడు, ఆ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అఖండనామ సంకీర్తన



సత్యసాయి బాబా సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

తెర్లాం: సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా డి.గదబవలస గ్రామంలోని సత్యసాయి బాబా మందిరంలో శుక్రవారం వంద గంటల దివ్య అఖండనామ సంకీర్తన కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని 35 గ్రామాలకు చెందిన భగవాన్ సత్యసాయి భజన మండలి, సేవాసమితి సభ్యులు హాజరై అఖండనామ సంకీర్తన చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ నాలుగు రోజులుపైనే జరగనున్న సంకీర్తన కార్యక్రమంలో సత్యసాయి బాబా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యోగాపై విస్తృత ప్రచారం చేయాలి



యోగాంధ్ర కార్యక్రమాలపై వైద్యులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలిరూరల్: యోగా వల్ల కలిగే లాభాలపై గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్ వైద్యాధికారులను కోరారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయుష్,హోమియో వైద్యాధికారులు, యోగా టీచర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఆయుర్వేద వైద్యాధికారి కనకమహాలక్ష్మి, హోమియో వైద్యాధికారి సుహానా,ఏఓ అప్పారావు, యోగా టీచర్లు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: గ్రామాల్లోని మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని స్థానిక కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో సంతకవిటి మండల సచివాలయ మహిళా పోలీసులు, ప్యానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లతో జడ్జి వేర్వేరుగా శుక్రవారం సమావేశమయ్యారు. పోక్సో, బాల్యవివాహ నిరోధక చట్టాలతోపాటు ఉచిత నిర్బంధ విద్య తదితర చట్టాల గురించి సచివాలయ మహిళా పోలీసులకు వివరించారు. చట్టాలను ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. పనిప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా అధికారుల దృష్టికి తీసుకువస్తే తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. పనిచేసే ప్రదేశంలో అసభ్యంగా జోక్స్‌వేసినా, అసభ్యపదజాలం వాడినా, కించపరిచినా చట్టప్రకారం శిక్షార్హులేనని తెలిపారు. ఒకవేళ బాధిత మహిళ ఫిర్యాదు చేయలేని పరిస్థితిలో స్నేహితులు, కో–వర్కర్స్ ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అవసరమైతే డిపార్ట్‌మెంటల్ విచారణ జరుగుతుందని అన్నారు. మహిళలు కూడా ఈ చట్టాలను ఆసరాగా తీసుకుని సహోద్యోగులపై అనవసరమైన ఫిర్యాదులు చేయరాదని కోరారు.జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, సంతకవిటి ప్రత్యేకాధికారి కె.సురేష్‌కుమార్, ప్యానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆయుర్వేద వైద్యశిబిరాలు



ఉప్పర్నాయుడువలసలో సేవలందిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అధికారి ఎస్.సునీల్ కుమార్ ఆధ్వ ర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. కీళ్లనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మ వ్యాధులతో బాధపడుతు న్న వారికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వారికి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.

భూవివాదంపై విచారణ



వివాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని జె.కొత్తవలస గ్రామంలో రామాలయ నిర్మాణంలో ఏర్పడిన స్థల వివాదంపై తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ విచారణ చేశారు. శుక్రవారం ఆయన ఆ గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో వివాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో రామాలయ నిర్మాణానికి గ్రామస్తులంతా నిర్ణయించుకున్నారు. అయితే ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో తన భూమి ఉందని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గ్రామానికి వెళ్లి రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు కేటాయించిన స్థలానికి హద్దులు వేశారు. ఆలయ నిర్మాణానికి కొంత స్థలం సరిపోకపోవడంతో గ్రామానికి చెందిన జాడ సత్యనారాయణ అనే వ్యక్తి తన సొంత స్థలంలో కొంత భాగాన్ని ఇచ్చేం దుకు స్వచ్ఛందగా ముందుకు రావడంతో వివాదం సద్దుమణిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రామాలయ నిర్మాణం చేపట్టేందుకు తీసుకున్న నిర్ణయం మంచిదేనని, అయితే ఎటువంటి వివాదాలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ రమణమూర్తి, ఆర్ఐ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల లావాదేవీలపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

బొబ్బిలిరూరల్: మండలంలోని అలంజంగి గ్రామంలో పొదుపు సంఘాల నిధులు లక్షలాది రూపాయలు గోల్‌మాల్ అయ్యాయన్న ఫిర్యాదులపై వెలుగు అధికారులు శుక్రవారం ఆ గ్రామ సచివాలయంలో విచారణ ప్రారంభించారు. గ్రామంలో 108 సంఘాలు ఉండగా దాదాపు ఐదేళ్లుగా సంఘాల రుణాలు,పొదుపులపై ఆడిట్ నిర్వహణకు సభ్యులు ముందుకు రాకపోవడంతో ఇన్నాళ్లూ వాయిదా వేశారు. గతంలో పలుమార్లు ఆడిట్‌కు స్వచ్ఛందంగా కొన్ని సంఘాలు ముందుకొచ్చినా,కొన్ని సంఘాలు మొండికేసి వాగ్వివాదానికి దిగడంతో అధికారులు ఆడిట్‌ను మధ్యలోనే నిలిపివేశారు. గ్రామంలో వీఓఏగా పనిచేసిన పద్మ పొదుపు సంఘాలకు సంబంధించి లక్షల రూపా యలను జమాఖర్చు చూపకుండా కాజేశారని ఆరోపిస్తూ పలువు జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆశాఖ అధికారులు మళ్లీ విచారణ ప్రారంభించారు. వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, రాజాం,మెంటాడ,రామభద్రపురం,గరివిడి ఏపీఎంలు, స్త్రీనిధి మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

ఫారం పాండ్ల పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథాచారి

వంగర: గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఫారం పాండ్ల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి ఉపాధి సిబ్బందికి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలానికి 70 ఫారం పాండ్లు మంజూరు కాగా ఇప్పటికి 30 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో మత్రాపు సత్యవతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట జంక్షన్ వద్ద వాహన చోదకులు, ప్రయాణికులకుఎస్ఐ నీలావతి ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగా హన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమాని చర్యలు తీసుకుంటామని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని చెప్పారు.

29న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 29న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు హౌస్ వైరింగ్ (30 రోజులు శిక్షణ), ఫొటో అండ్ వీడియోగ్రఫీ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (31 రోజులు), రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ (75 రోజులు), అలాగే స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (31 రోజులు), కంప్యూటర్ ట్యాలీ అండ్ బేసిక్స్ (38 రోజులు), హోమ్ నర్సింగ్ (ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రూ.17వేల జీతంతో ఉద్యోగం, ఉచిత వసతి) (30 రోజుల పాటు), జూట్ బ్యాగ్స్ తయారీలో 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందని స్పష్టం చేశా రు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్‌కా ర్డు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. శిక్షణా కాలంలో భోజన, వ సతి సదుపాయం కల్పించనున్నామని, వివరాలకు 90147 16255, 94917 41129, 98669 13371, 99899 53145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

25న నలచరిత్ర పుస్తకావిష్కరణ

రాజాం సిటీ: స్థానిక హోటల్ కల్కీఇన్‌లో ఈ నెల 25న రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బెహరా రామకృష్ణ కవి 200 ఏళ్ల క్రితం రచించిన 'నలచరిత్ర' ప్రబంధాన్ని విజయనగరానికి చెందిన డాక్టర్ ఏ.గోపాలరావు ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిగ్రీ కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు మేడూరి సత్యనారాయణమూర్తి గ్రంథ పరిచయం చేయనున్నారని, కవులు, రచయితలు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

ప్రజా దర్బార్

బొబ్బిలి: స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబి నాయన శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అదేసమయంలో మున్సిపల్ కౌన్సిలర్ల నుంచి వార్డుల్లోని సమస్యలను లేఖల రూపంలో స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తామని కౌన్సిలర్లకు తెలియజేశారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



ఇంటింట అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వంశీ

బొబ్బిలిరూరల్: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ అన్నారు.మండలంలోని ఎరకందొరవలస గిరిజన గ్రామంలో వైద్యసిబ్బందితో కలిసి శుక్రవారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా బాల్యవివాహాలు చేయవద్దని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలను చేసే వారికి, ప్రోత్సహించే వారికి శిక్ష తప్పదన్నారు. ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల ఆరోగ్య, మానసిక సమస్యలు పెరుగుతాయని,చిన్న వయస్సులో గర్భం దాల్చితే ప్రాణాంతకం అవుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ ఆడ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు. సచివాలయ మహిళాపోలీస్ అనురాధపాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం

వంగర/రేగిడి: బాలికా విద్యకు ప్రాధాన్యతనివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సన్యాసమ్మ, సీహెచ్.నూకాలమ్మ అన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా వంగర మండలంలోని అరసాడ, రేగిడి మండలంలోని రంగరాయపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, వారి తల్లులకు బాలికా విద్య, ఆరోగ్యం, రక్షణ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. పోక్సో, బాల్యవివాహాల నిషేధ, తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.బడికి వెళ్తూ మధ్యలో మానేసిన పిల్లలను పాఠశాలల్లో తిరిగి చేర్పించాలని తల్లులను కోరారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.